క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ



యండగండి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయి

ఉండి: జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి బుధవారం యండగండి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. పీహెచ్‌సీకి సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు సలహాలను అందజేశారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా పీహెచ్‌సీ వద్ద నిర్మిస్తున్న నూతన భవనాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు

భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వీకే విశ్వనాథరాజు, కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని నిత్యాన్నదానానికి విరాళం



అన్నవరం దేవస్థానంలో విరాళం అందజేస్తున్న దాతలు

కాళ్ల: అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం నిత్య అన్నదాన పథకానికి కాళ్ల గ్రామస్తులు విరాళం అందించారు. గ్రామానికి చెందిన మండలపర్తి చంద్రశేఖర్, శ్రీబాల దంపతులు రూ.1,00,000 విరాళాన్ని అందజేశారు. బుధవారం వారు విలేకరులకు వివరాలు వెల్లడించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: తోలేరు శివారు పడమటి పాలెంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపోలేరమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. గణపతి పూజతో పాటు ప్రత్యేక హోమాలను చేపట్టారు. ఎంపీపీ వీరవల్లి దుర్గ భవానీ, చంద్రశేఖర్ దంపతులు పూజాధికాలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు తోట సీతామహాలక్ష్మి, మెంటే పార్థసారథి, గుండా జయప్రకాష్ నాయుడు, వెంద్ర లీలా కృష్ణ, భోగి రెడ్డి శ్రీనివాసు, అద్దాల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రంగంనాయుడు

పాలకోడేరు: గర్భిణులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పాలకోడేరు ప్రాథమిక వైద్యాధికారి సీహెచ్ వి.రంగంనాయుడు అన్నారు. ప్రతి నెలా 9వ తేదీన నిర్వహించే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుమారు 60 మంది గర్భిణులకు రక్త పరీక్షలు చేయించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేరు నమోదు చేయించుకోవాలని, ఆ గ్రామంలో ఉన్న ఏఎన్ఎంకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా మొదటి నుంచి వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన తల్లీ, బిడ్డకు ఏమైనా సమస్యలు ఉంటే తెలుస్తుందని, తద్వారా వైద్యం పొందితే ప్రసవ సమయంలో ఇబ్బందులు ఉండవన్నారు. డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్ఓ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు హెచ్‌వీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- ఏటా వరి చేలను ముంచుతున్న బొర్రకోడు
- తూడు, గుర్రపుడెక్క తొలగించాలని రైతుల మొర
- ప్రతి ఏటా ఇదే తంతు.. పట్టించుకోని అధికారులు



వరి చేలల్లో నీటిని బయటకు తోడుకుంటున్న రైతులు



ఉప్పుగుంట రోడ్డులో తూడు, గుర్రపుడెక్కతో నిండిపోయిన బొర్రకోడు

ఉండి: ఆక్వాసాగు మోజులో పడి వరి పంటకు ఉరి వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వరి రైతులకు సహకారం లేకపోగా ఇప్పుడు అధికారుల నుంచి కూడా పూర్తి నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు పంట కాలువలు, మురుగు బోదెలపై దృష్టి సారించడమే మరచిపోయారన్నట్లుంది నియోజకవర్గంలో పరిస్థితి. దీనికి ఉదాహరణగా ఉండి శివారు ఉప్పుగుంట రోడ్డులోని బొర్రకోడు పరిస్థితి అద్దం పడుతుంది. కోడు పరిధిలో చుట్టు పక్కల సుమారు 200 నుంచి 250 ఎకరాల వరకు వరిసాగు, ఎత్తున ఆక్వా చెరువులు ఉన్నాయి. అయితే రైతులు పంట చేతికొచ్చే సమయంలో ఆక్వా చెరువుల కోసం అధికారులు నీటిని విడుదల చేయడంతో బొర్రకోడు నుంచి సాగునీరు వరి పంటను ముంచెత్తింది. దీంతో పంట కోత కొచ్చే సమయంలో వరి చేలు ముంపుకు గురవుతున్నాయి. అయితే రైతులు, కౌలు రైతులు హుటాహుటీన మోటార్ల సహాయంతో వరిపంట పొలాల్లోని నీటిని బయటకు తోడుకుంటున్నారు. ఇదంతా అధికారుల నిర్లక్ష్యం వల్లనే జరిగిందంటూ రైతులు వాపోతున్నారు. కోడులోని చెత్త తొలగించమని ఎంత మొత్తుకున్నా అధికారులు గానీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ నాయకులు గాని పట్టించుకోలేదంటూ లబోదిబోమంటున్నారు. ఇదే విధంగా ప్రతి ఏటా ఉప్పులూరు, యండగండి, ఎన్నార్పీ అగ్రహారం, తదితర గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి.

కనిపించని కోడు

ఉప్పుగుంట రోడ్డు వెంబడి ప్రవహించే బొర్రకోడు ద్వారా పెద్ద సంఖ్యలో వరి చేలు, ఆక్వా సాగు జరుగుతుంది. ఇంత ప్రాముఖ్యమున్న కోడును అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. ఈ కోడు ఒకసారి సాగు నీటితోనూ, మరోసారి ఆక్వా వ్యర్థాలతోనూ నిండి ఉంటుంది. దీంతో కోడు స్వరూపమే పూర్తిగా మారిపోయింది. కొన్ని ప్రాంతాల్లో కోడు ఉందనే భావన లేకుండా తూడు, గుర్రపుడెక్కతో అధ్వానంగా మారింది. మరికొన్ని ప్రాంతాల్లో అయితే కోడుపై భాగం గట్టిపడిపోయి పూడుకుపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు.

దెబ్బతింటున్న రోడ్డు

బొర్రకోడు తూడుతో నిండిపోవడంతో అధికారులు సాగునీటిని పూర్తి స్థాయిలో విడుదల చేయడంతో నీరు ఉప్పుగుంట ఉండి రోడ్డుపైకి వచ్చి దెబ్బ తింటుంది. ప్రతి రోజూ ఆక్వా చెరువుల కోసం భారీ వాహనాలు రోడ్డుపై వెళ్లడంతో రోడ్డు దిగబడి పోతుంది. అంతేకాకుండా ఉప్పుగుంట వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురుకాక తప్పదని స్థానికులు వాపోతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



పంట చేతికొచ్చే సమయంలో ఇలా చేయడం చాలా దారుణం. గతంలో కోడులో తూడు తొలగించాలని అధికారులకు చాలా సార్లు విన్నవించాం. కానీ వారు ఏమాత్రం పట్టించుకోలేదు. దాని వల్లనే ఈ రోజు వరి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇంజన్ల సహాయంతో నీటిని బయటకు తోడుకోవలసి వస్తుంది. అయినా ఊటల ద్వారా మళ్లీ నీరు చేలల్లోకి వచ్చేస్తుంది.

–వీర్రాజు, కౌలు రైతు, ఉండి

ఏటా మునుగుతుంది



ఏటా అధికారులకు చెబుతూనే ఉన్నాం, మునుగుతూనే ఉంది. పంట కాలువలు, పంట బోదెల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికలు తీయించాలని మొర పెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ముంపుకు గురయ్యే ప్రాంతాల్లో ఉప్పులూరు ముందు వరుసలో ఉంటుంది. ఈ వేసవిలో అయినా అధికారులు, డీసీ కమిటీ వారు పట్టించుకుంటే రైతులు నష్టాల నుంచి గట్టెక్కుతారు.

–నిమ్మల కేశవకుమార్ (బాలు), రైతు, ఉప్పులూరు

చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలి



రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

భీమవరం: అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడిన దివంగత సీపీఐ నేత చంద్ర రాజేశ్వరరావు ఆశయాల సాధనకు కృషి చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాంప్రసాద్ అన్నారు. చంద్ర 31వ వర్ధంతి సందర్భంగా భీమవరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ చల్లపల్లి జమిందార్‌కు వ్యతిరేకంగా భూపోరాటం చేసి వందలాది ఎకరాలు పేదలకు పంచిన మహోన్నత వ్యక్తన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, తిరుమాని కామేశ్వరరావు, ఛాన్‌భాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి

ఉండి: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉండి సెంటర్‌లో గ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా సీపీఎం మండల కార్యదర్శి చీర్ల శేషు ఆధ్వర్యంలో ఖాళీ గ్యాస్ బండలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సామాన్యులు జీవనోపాధి కోసం ఇబ్బందులు పడుతుంటే గ్యాస్ బండపై రూ.50 పెంచడం దారుణమన్నారు. విద్యుత్ బిల్లులు పెంచి సామాన్యుల నడ్డివిరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొట్టాడ వెంకటేశ్వరరావు, మోపిదేవి రాము, రామకూరి వెంకటరత్నం, చీర్ల శ్రీనివాస్, నక్కా వెంకటేశ్వరరావు, రుద్రరాజు విజయరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలను తగ్గించాలి

కాళ్ల: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని పాతాళ్లమెరకలో సిపిఎం నాయకులు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం కాళ్ల మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో దుర్మార్గంగా ప్రజలపై అనేక భారాలు వేస్తుందన్నారు. కార్యక్రమంలో తిరుమాని శ్రీను, దాసి బాలయ్య, రామలక్ష్మి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



ఉండి: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



కాళ్ల: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

తాగునీటి ఎద్దటి నివారణకు చర్యలు చేపట్టాలి

భీమవరం అర్బన్: గ్రామాల్లో తాగునీటి ఎద్దటి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.సీతారామ్ ప్రసాద్ కోరారు. బుధవారం తహసీల్దార్ రావి రాంబాబుకు వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి ఎం.సీతారామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో చెరువులకు పూర్తి స్థాయిలో నీటిని నింపాలన్నారు. ఈ నెల 16న పంట కాలువలు కట్టేస్తారని అధికారులు హెచ్చరిస్తున్నారని గుర్తు చేశారు. తహసీల్దార్ రావి రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఆ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తాగునీటి ఎద్దటి లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు తిరుమాని కామేశ్వరరావు, మల్లుల శ్రీనివాసరావు, చాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బెల్టు షాపుల నిర్వాహకుల అరెస్టు



భీమవరం: నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు



కాళ్ల: పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

భీమవరం: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు బుధవారం చెప్పారు. పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో ఉప్పలపాటి వీరన్నను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే భీమవరం మండలం దెయ్యాలతిప్ప గ్రామంలో దొంగ శ్రీనివాస్‌ను అరెస్టు చేసి అతని వద్ద 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బలరామరాజు చెప్పారు.

ఎక్సైజ్ దాడులు

కాళ్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. అనధికారంగా మద్యం అమ్ముతున్న విస్సాకోడేటి సుబ్బారావును అదుపులోకి తీసుకున్నామని ఆకివీడు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణప్రియ తెలిపారు. అతడి వద్ద 10 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుజాతరాణి

భీమవరం: పట్టణంలోని దుర్గాపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఆఫీసర్ బి.సుజాతరాణి మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు, పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించడం, గర్భిణులు, బాలింతలు, సంరక్షకులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్ కె.సరళ, కార్యకర్త సీహెచ్ మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మున్సిపాలిటీలో 4,5,33 వార్డుల పరిధిలో రూ.6.30 కోట్ల నిధులతో కొత్త సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి బుధవారం సాయంత్రం కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ,పీఏసి చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరసయ్య అగ్రహారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడారు.

మూతపడిన ఆర్వో ప్లాంట్



చినమిల్లిపాడులో తాళం వేసి ఉన్న ఆర్వో ప్లాంట్

ఆకివీడు: మండలంలోని చినమిల్లిపాడులో ప్రజల దాహార్తిని తీర్చే ఆర్వో ప్లాంట్‌ను మూసి వేశారు. కొల్లేరు తీరంలో చుట్టూ నీరున్నా గుక్కెడు మంచి నీళ్లు కరువయ్యాయి. తాగేందుకు మంచినీరు దొరకని పరిస్థితుల్లో గ్రామస్తులు ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుని మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానిక కూటమి నాయకులు ఆర్వో ప్లాంట్‌ను తామే నడుపుతామని కొన్ని నెలలు నడిపిన తరువాత తాళం వేశారు. దీనిని గ్రామస్తులు వ్యతిరేకించి తామే ప్లాంట్‌ను నిర్మించినందున, దానికి అయ్యే ఖర్చులు తామే భరించి ప్రజలకు నీరందిస్తామని ఇటీవల ప్లాంట్‌ను తెరిచి మంచినీటిని సరఫరా చేశారు. మళ్లీ కూటమిలోని ఒకరిద్దరు నాయకులు దీనిని అడ్డుకుని స్వాధీనం చేసుకుని ప్రస్తుతం తాళం వేశారు. స్థానిక ప్రజలకు మంచినీరు అందక రెండు, మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి క్యాన్ల ద్వారా ఆర్వో వాటర్ కోసం కొత్త చెరువు, కోళ్లపర్రు గ్రామాలు వెళ్లాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందిని పట్టించుకోవడం లేదని, అధికారులు ఏ విధమైన చర్యలూ తీసుకోవడం లేదని వాపోతున్నారు. వేసవి కాలంలో మంచినీటి అవసరాలు అధికంగా ఉన్నందున ప్లాంట్‌ను వెంటనే తెరవాలని వారు కోరుతున్నారు. దీనిపై నియోజకవర్గ పాలకులు కూడా దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తమ గ్రామంపై పాలకుల కక్ష సాధింపు చర్యలతో తాము అన్ని విధాలుగా నష్టపోతున్నామని, చివరకు మంచినీరు దొరకని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఎన్నార్ కళాశాల డిగ్రీ పరీక్షా ఫలితాలు విడుదల

భీమవరం: డీఎన్నార్ కళాశాలలో డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బుధవారం కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ఫలితాల్లో బీఏ, బీఎస్సీ, బీకాం (జనరల్), బీకాం (కంప్యూటర్స్) కోర్సుల్లో నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకూ 250 మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ జి.మోజెస్ మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరం నుంచి బీబీఏ, బీసీఏ కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు పి.రామకృష్ణంరాజు, అల్లూరి సురేంద్ర, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డి.శ్రీనివాసరాజు, అడిషనల్ కంట్రోలర్స్ వి.చంద్రశేఖర్, కె.సంతోష్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి అనారోగ్యం

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీకి అనారోగ్యం తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జయసరిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీని తొలగించి ప్రైవేటు బీమా సంస్థలకు అప్పగించాలని యోచిస్తుందన్నారు. పేద మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని నాడు మహా నేత వైఎస్ రాజశేఖరరెడ్డి కార్పొరేట్ స్థాయిలో ఆరోగ్యశ్రీని అమలు చేస్తే కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అస్తవ్యస్తం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లిఖార్జునరావు, హేమలత, హైమావతి, కుమారి, జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి ఊరేగింపు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

ఆకివీడు: శ్రీరామ నవమి సందర్భంగా స్థానిక వెలంపేట కోదండ రాములోరి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. 69వ వార్షికత్సవం సందర్భంగా సీతారామ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.స్థానికులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చలువ పందిరిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డ లేదా నార సంచులను వాడాలని పశు ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జావర్ హుస్సేన్ అన్నారు. విజ్ఞాన వేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో భీమవరం పశు ఆసుపత్రి వద్ద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి, 50 గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఏడీ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడే వారితో పాటుగా వాటిని విక్రయించిన వారికి ప్రభుత్వం జరిమానాలు విధిస్తుందన్నారు. నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నినాదంతో ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, శిరీష, బేబీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వంతెన మూసివేత

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరు-నవుడూరు రోడ్డులో గల యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనపై కాంక్రీట్ పనులు చేపట్టనున్నట్లు ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఏఈ రామరాజు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వాహనాల రాకపోకలు నిషేధించినట్లు తెలిపారు. పాలకోడేరు నుంచి వచ్చే వాహనాలు కుముదవల్లి, భీమవరం భీమవరం మీదుగా వెళ్లాలని, గొల్లలకోడేరు నుంచి పాలకోడేరు వెళ్లే వాహనాలు భీమవరం, కుముదవల్లి మీదుగా వెళ్లాలని వాహనదారులకు సూచించారు.

ఆక్వా రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

భీమవరం: ఉభయ గోదావరి జిల్లాలను ఆక్వా క్యాబ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగల్భాలు పలికారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడు స్వభావంతో ఆక్వారంగం కుదేలవుతుందని ఆయన విమర్శించారు. చంద్రబాబునాయుడు వాణిజ్య పంటలు పండించి విదేశాలకు ఎగుమతులు చేసే విధంగా రైతాంగం నిలబడాలని పిలుపునిచ్చారన్నారు. ఇప్పుడు ఆక్వా రైతులు రోడ్డున పడితే కనీసం పట్టించుకోకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని నెత్తిన పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వాణిజ్య యుద్ధానికి తెర లేపిన కారణంగానే భారతదేశంలో ముఖ్యంగా ఆక్వా రంగం కుదేలైందన్నారు. వేలాది మంది రొయ్యల సాగుపై ఆధారపడి జీవిస్తుండగా ప్రభుత్వ విధానాల వల్లనే క్రాప్ హాలిడే ప్రకటించాలని రైతులు నిర్ణయించారన్నారు. ఇప్పటికైనా తక్షణం ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని హరేరామ్ డిమాండ్ చేశారు.

ఆర్టీఐపై అవగాహన తప్పనిసరి

ఉండి: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని తహసీల్దార్ కె.నాగార్జున అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీ శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.నాగార్జున తెలిపారు. ముందుగా ఆర్టీఐపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నిర్వహించే అవగాహన సమావేశానికి అన్ని కార్యాలయాల సహాయ పౌర సమాచార అధికారులు, ఆర్టీఐ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని తహసీల్దార్ కోరారు.